మా అమ్మమ్మ ఊర్లోనే 50, 60 వేలు జమ వేసారంటే ఇక ఈ జంట నగరాల్లో ఎన్ని లక్షలు ఖర్చువేస్తారో ఆలోచించు? అంత మొత్తాన్నిలా నలుగురికి ఇబ్బంది కలిగించేలా ఖర్చు వేస్తే వచ్చే పుణ్యమేంటి చెప్పు? దాని బదులు లిమిటెడ్‌గా కొన్ని విగ్రహాల్నే ప్రతిష్టించి మిగతా డబ్బుతో ఒక అనాధ ఆశ్రమాన్నో, స్కూలునో పేదలకు ఉచితంగా ఇచ్చే కళ్యాణ మండపాన్నో, ధర్మశాలనో కడితే ఎంత బావుంటుంది? లేదా బీదలకు నాలుగు రిక్షాలు కొనివ్వండి. పేద స్త్రీలకు కుట్టుమిషన్లు ఇప్పించండి. లేదా బీద రోగులకు గుండె చికిత్సకు మూత్రపిండాల చికిత్సకు, తెలివైన పేద విద్యార్థులకు పై చదువులకై ఖర్చువేయాలి. బావుంటుంది కదా. అలా పోటీలతో పెద్ద విగ్రహాలు కొనడం, వాటిని చివరికి నీటిలో ముంచడం... ఇలా నీటిని కలుషితం చేయడం... ఇప్పటికే ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థ పదార్థాలతో నీరంతా పాడై ఎంతో భయంకర రోగాలొస్తున్నాయి కదా. పోనీ ఇదైనా సవ్యంగా, కామ్‌గా జరుగుతుందా? అంటే అదీ లేదు. ఈ పండగ పేరుతో ప్రజలకే కాక ప్రభుత్వానికి కూడా డబ్బు ఖర్చే. రాజకీయ నాయకులు తమ స్వార్థంకై మతకలహాలు సృష్టించడానికి వీటిని వేదికలుగా వాడుకుంటారు. ఇరుమతస్థులిలా గొడవ పడడం, మధ్యన అమాయకులు హత్య గావింపబడడం, పిల్లలు అనాధలవడం, స్త్రీలు విధవలవడం, ప్రభుత్వం వీటినాపడానికై పోలీసులను, సైన్యాన్ని వాడడం దీనికెంతో ఖర్చుకదా? ప్రభుత్వం ఖర్చు చేసినా అది మళ్ళీ వసూలు చేసేది ప్రజల నుండే కదా! అలా మళ్ళీ మనకేగా భారం పెరగేది. ఈ మధ్యన వీటితో స్కూలుకెళ్ళే పిల్లలకు, ఆఫీసులకెళ్ళే పెద్దలకు, సామానుకై వెళ్ళు గృహిణులకు ఎంతో ఇబ్బంది కదా. బస్సులు పగలగొట్టడం, కాలబెట్టడం ఓహ్! ఒక్కటనేమిటి ఎన్ని, ఎన్ని నష్టాలో కదా? అందుకే నాకు వీళ్ళంటే కోపం తప్ప భగవంతుడిపై ప్రేమ, ఇష్టం లేదని కాదు.

ఈ విషయాల్ని పరమాత్ముడే స్వయంగా ప్రజాపిత తనువులో ప్రవేశించి చెప్పాడు... అంటూ అనర్గళంగా మాట్లాడుతున్న మాధురిని నాకాకలిగా ఉంది కాసిన్ని పాలో, పండ్లో ఇవ్వు ఇప్పటికిక వినలేను గాని అంటూ దాని ప్రవాహానికి అడ్డువేసాం. మీరూ ఆలోచించండి ఇవన్నీ అక్షరాలా నిజమే కదా!

— కె. అనితాసాగర్ చీలా.
జనగామ.

## సమచిత్తం



(భగవాన్ శ్రీ సత్యసాయి బాబాగారి "చిన్నకథ" జగత్ప్రసిద్ధం. అది అన్ని భాషల వారికి చిన్న కథే. ఆ కథలో ఎన్నో, ఎన్నెన్నో భావార్థాలు, గూఢార్థాలు నిక్షిప్తమై వుంటాయి. వాటిని ఆస్వాదించి ఆనందించండి. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా గారి దివ్యోపన్యాసాలనుండి స్వీకరించి రచించిన ఆర్.సీతాలక్ష్మిగారి 'చిన్న కథ' ఆధారముతో... మహర్షి)

గౌతమ బుద్ధుడు దేశ సంచారం చేస్తూ, ప్రజలకు బోధనలు చేస్తూ ఓ గ్రామం చేరాడు. ఆ గ్రామాధికారికి బుద్ధుడు అంటే గిట్టదు. ఎవరైనా బుద్ధుడి మాట ఎత్తితే మండిపడేవాడు. ఒకరోజు బుద్ధుడు తన శిష్యులతో కలిసి తన గ్రామంలో అన్ని ఇళ్ళకు భిక్షాటనకు వస్తాడనే విషయం తెలుసుకుని, గ్రామంలో వున్న వారినందరినీ సమావేశపరచి, "ఈరోజు బుద్ధుడు మన గ్రామానికి భిక్షాటన కొస్తున్నాడు. అతనికి మీరెవ్వరు భిక్ష వేయకూడదు. మీ ఇంటి తలుపులు తీయకూడదు" అని ఆదేశించి తాను కూడా తన ఇంటికి తాళం పెట్టి ఇంటి ముందు అరుగు మీద కూర్చున్నాడు.

బుద్ధుడు ఏమీ తెలియని వానివలె చిరునవ్వుతో గ్రామాధికారి ఇంటి ముందు నిలబడి "భవతీ! భిక్షాందేహి" అన్నాడు. వెంటనే గ్రామాధికారి ఆవేశముతో నిందులు త్రొక్కుతూ "ఏమయ్యా! సోమరి సన్యాసీ! పనిపాటలేక భిక్షం ఎత్తి పొట్ట పోసుకుంటున్నావు. పైగా ఎంతో మంది యువకులను శిష్యులుగా చేర్చుకుని వాళ్ళ జీవితాలను నాశనం చేస్తున్నావు... కష్టపడి పనిచేసుకో! పో" అని నిందించాడు.

బుద్ధుడు ఏ మాత్రం ఛలించక చిరునవ్వుతో "అయ్యా! నాకొక సందేహమువున్నది. మీరు తీర్చెదరా!" అన్నాడు. గ్రామాధికారి "ఏమిటా సందేహం?" గద్దించి అడిగాడు.

అప్పుడు బుద్ధుడు "అయ్యా! మీ ఇంటికి ఒకడు అడుక్కోడానికి వస్తాడనుకోండి. మీరు దయతో అతనికివ్వటానికి ఒక పళ్ళెంతో మీకు తోచిన పదార్థాలను పెట్టుకుని వస్తారనుకోండి. మీరు ఆ పదార్థాలను అతనికి యివ్వబోతే, వాటిని అతను స్వీకరించకపోతే మీరు వాటిని ఎవరికిస్తారు?" ప్రశ్నించాడు.

గ్రామాధికారి "ఇదేం సందేహం! ఆ పదార్థాలు నావి కనుక మళ్ళీ నేను ఇంట్లోనికి తీసుకెళతాను. అంతే కదా!" అన్నాడు. బుద్ధుడు చిరునవ్వుతో "అయితే ఆ పదార్థాలన్నీ మీకే చెందుతాయి కదా!" అని అడిగాడు. గ్రామాధికారి "అవును. అవి నాకే చెందుతాయి" అన్నాడు.

బుద్ధుడు వెంటనే చాలా బాగా సమాధానం చెప్పాడు. "నేను మీ ఇంటికి వచ్చి భవతీ! భిక్షాందేహి అన్నాను. మీరు నన్ను దూషించారు. మీరు దూషణనే భిక్షగా పెట్టారు. కాని మీరు పెట్టిన వాటిని నేను స్వీకరించడం లేదు. కాబట్టి మీరు పెట్టిన దూషణలు ఎవరు స్వీకరించాలో మీరే ఆలోచించి చెప్పండి" అన్నాడు.

ఏం సమాధానం చెప్పాలో గ్రామాధికారికి తోచలేదు. ఏమని చెప్పగలడు?

వెంటనే బుద్ధుడి పాదాల మీదపడి క్షమించమని వేడుకున్నాడు.

నిందా స్తుతులను, కష్టనష్టాలను చిము చిత్తముతో స్వీకరించాలి. కోప తాపాల రాగద్వేషాలకు లొంగిపోకూడదు.

— మహర్షి.